# మనుష్యులు, మమకారాలు

"పార్వతమ్మ... ప్రాణాపాయపరిస్థితి.. తక్షణం రావలెను" టెలిగ్రాం చూచుకుని లోపలికిపోతూ ప్రభాకరం "రాధా! రాధా! తక్షణం బయల్దేరు ఆశ్రమంనుంచీ టెలిగ్రాంవచ్చింది" అన్నాడు.

"ఏమైందండీ? ఏముందందులో" అంటూ వంటగదిలోనుంచీ కంగారుగా బయటికి వచ్చింది రాధ.

"ఇందులో రెండు మాటలకంటే ఎక్కువ లేదు. అసలు విషయం మనకక్కడికి వెళ్తేగానీ తెలియదు" అన్నాడు ప్రభాకరం.

రాధ తొందరగా వంట ముగించింది. భోజనంకాగానే ప్రభాకరం వీధిలోకివెళ్ళి జట్కా తీసుకొచ్చాడు. ఆపాటికి రాధ ట్రంకులో బట్టలు సర్దుకుంది.

బయల్దేరినవేళ మంచిదేమో! కొంచెం ఆలస్యమైనా బస్సులో సీటుదొరికింది.

చిట్టడివి మధ్య వంకరలు తిరిగిపోతున్న తారురోడ్డుపైన నున్నగా జారిపోతున్న బస్సులో కూచున్న ప్రభాకరం తలపులన్నీ నాలుగైదేళ్ళు వెనక్కు పరుగెత్తాయి. అత్తయ్య, మామయ్య, రామ్మూర్తి, రవణ ఒక్కొక్కరుగా అతడి స్మృతిపథంలో మెదలిపోసాగారు. ఈ నలుగురిలోనూ మామయ్య యిప్పుడు లేడు. అత్తయ్య చావుబ్రతుకుల్లో వుంది. రామ్మూర్తి, రవణ ఎక్కడున్నారో తనకు తెలియదు!

ప్రభాకరం అదోతరహా మనిషి. అతడిది అంతకూ, యింతకూ ఆశ్చర్యం ప్రకటించే స్వభావంకాదు. భూమిపైకి బాగా వాలిపోయివున్న పైసానగరపు గాలిగోపురం ఎన్నోశతాబ్దాలుగా అలాగే నిలిచివుందని ఎవరైనా ఆశ్చర్యం వెలిబుచ్చితే "ప్చ్, అందులో ఏముంది. దాని గరిమనాభిలోనుంచీ వచ్చే లంబరేఖ ఆధారతలంలోనే పడుతుంటుంది. నువ్వు పనిగట్టుకుని కూలదోస్తేగానీ అది క్రిందపడదు" అని ప్రభాకరం సహేతుకంగా కార్యకారణ సంబంధాన్ని విశదీకరిస్తాడు. 'మెరుపు ఎంత చిత్రంగా వుద్భవిస్తుందబ్బా' అని అతనిముందు చెప్పిచూడు! "మేఘాలు ఢీకొన్నప్పుడు మెరుపు పుట్టడంలో ఏంచిత్రముంది? ఒకవేళ ఏనాటికైనా మేఘసంఘర్షణవల్ల మెరుపు పుట్టకపోతే అది అత్యాశ్చర్యకరమైన విషయమౌతుంది" అంటాడు ప్రభాకరం. ఐతే అలాటి ప్రభాకరానికి కొండంత ఆశ్చర్యం కలిగించే విషయమొకటి ఈ విశాల ప్రపంచంలో లేకపోలేదు. తన మేనత్తకొడుకుల విచిత్ర సౌభ్రాతృత్వాన్ని గురించి తలచుకున్నప్పుడల్లా, వాళ్ళ విచిత్రప్రవర్తనకు వెనుక దాగివున్న వింత మనస్తత్వాన్ని అర్థం చేసుకోడానికి ప్రయత్నించి, ప్రయత్నించిన ప్రతిసారీ విఫలుడైపోతూ వుంటాడు ప్రభాకరం!

రామ్మూర్తి తనకంటే నాలుగైదేళ్ళు పెద్దవాడు. రవణకి తనకీ ఈడే వుంటుంది. ఇద్దరిదీ కాపురాలు వెలగబెట్టవలసిన వయస్సే. చదువుకునివుంటే వాళ్ళూ తనలా అర్జనపరులై వుండవలసింది. ఐతే అర్జన, పెళ్ళి పెటాకుల్లాంటి సాంసారిక విషయాల్ని ఈ అన్నదమ్ములు పట్టించుకోరు. ఐనా వాళ్ళకు డబ్బుతో మాత్రం ఎడతెగని అవసరాలుంటాయి. తిండివిషయం అటుంచి టిఫెన్, ధూమపానాలకే వాళ్ళు రోజుకొకటి రెండు రూపాయలు తగలేస్తారు. నిత్యవ్యవహారాల్లో వాళ్ళకు నిర్ణీతమైన పద్ధతులంటూ లేవు. చేతడబ్బు పుష్కలంగా వుంటే వాళ్ళు గోల్డుఫ్లేక్ సిగరెట్టు తప్పా మరొకటి ముట్టరు. జేబు ఖాళీఅయితే ఒకే బీడీని నాలుగైదుసార్లు ఆర్పి మళ్ళీమళ్ళీ పొగపీల్చడానికి వెనుదీయరు! హమేషా వాళ్లు దేశంపైన పరిభ్రమిస్తారు. మరీ ఆశ్చర్యకరమైన విషయమేమంటే వాళ్ళని చూచినవాడు వీళ్ళన్నదమ్ములని అనుకోడానికి అణుమాత్రమైనా ఆస్కారముండదు. ఒకరిభుజాలపైన ఒకరు చేతులు వేసుకుంటారు. ఒకరి సిగరెట్టుతో ఒకరు సిగరెట్టు కాల్చుకుంటారు. ఇక పేకాట పట్ల ఆ అన్నదమ్ములకున్న ప్రీతి చెప్పకోతగ్గది! ఏఏవూళ్ళో ఎప్పుడెప్పుడు పేకాట జరుగుతుందో వాళ్ళకు తెలిసినట్టు మరొకరికి తెలియదు. ఎప్పుడో యిష్టమైనప్పుడు దూరపు బంధువుల్లా స్వగ్రామానికి విజయం చేస్తారు. నాలుగైదురోజులు గృహకలాపాల్లో అత్యాసక్తి కనబరుస్తారు. ఆకోరోజా వుదయానికి అయిపులేకుండా మాయమౌతారు. వాళ్ళతోబాటు యింట్లోడబ్బో, దస్కమో మాయం కావడమూ, అందుకోసం మామయ్య నాలుగుతిట్టి, అత్తయ్య రెండేడుపులు ఏడ్చి వూరుకోవడమూ సూర్యోదయ సూర్యాస్తమానాల్లా సహజ పరిణామాలు!

వంచనాశిల్పం కూడా ఒకగొప్పకళ అని ఆ అన్నదమ్ములు లోకానికన్నోసార్లు నిరూపించారు. విచిత్రమేమిటంటే వాళ్ళు ఒకేమనిషిని ఎన్నిసార్లయినా మోసగించగలరు. ఒకరివిషయం యిక్కడెందుకు గానీ, వాళ్లుపన్నిన వుచ్చుల్లో తగులుకుని తనుగూడా ఎన్నిసార్లు గిలగిల లాడిపోలేదు!

* * *

"ప్రభాకరం! ప్రభాకరం!"

తలుపు దబదబ మ్రోగిపోతోంది. ప్రభాకరం లేచి కూర్చున్నాడు.

ఇంకా తెల్లవారలేదు. అంతలో తెల్లవారడం ప్రభాకరానికి యిష్టంలేదు కూడా! తియేటరునుంచీ హోటలుకు వెళ్ళి తిన్నశాస్త్రం ముగించుకుని యిల్లు చేరుకునే సరికి తాలూకాఫీసులో పదకొండు కొట్టారు. సరే. పడకపైన దొర్లుతూ వుండగానే ఒకటోరెండు గడియలు గడచిపోయి వుంటాయి. బహుశా ఏ అర్థరాత్రప్పుడో నిద్రాదేవి ప్రభాకరాన్ని తన కౌగిలిలోకి ఆహ్వానించి వుంటుంది. ఆ నిద్ర నిరభ్యంతరంగా అలాకొనసాగి వుంటే ప్రభాకరం సూర్యోదయానంతరం ఏ ఎనిమిదికో, తొమ్మిదికో లేచి ఆదరాబాదరా గడ్డం గీసుక్కుని, స్నానంచేసి, హోటల్లో వెచ్చగా ఒక గ్లాసుడు కాఫీ సేవించి పదిగంటలకు కాలేజీ చేరుకునే వాడు. కానీ చీమచిటుక్కంటే వులికిపడి మేలుకునే ప్రభాకరానికి అంతటి గాఢ నిద్ర పట్టడం కంటే అసంభవమైన విషయం మరొకటి వుండదు. అందులోనూ అతడు పడుకున్న గదికి దశదిశలా పరివ్యాప్తమై వున్న పట్టణంలో ఏసమయానికి ఎలాటి గందరగోళం వుద్భవిస్తుందో వూహించడంకష్టం. లేకుంటే వేకువఝామప్పుడు గణగణ గంట మ్రోగించుకుంటూ మునిసిపాలిటి వారి ఫైరింజన్ శరవేగంతో పరుగెత్తడమేమిటి? ఇంకెక్కడా వీధులు కరవై పోయినట్లు రిజర్వు పోలీసు దళం అయిదుగంటలవేళ రోడ్ మార్చింగుకు రాజవీధినే ఎన్నుకోడమేమిటి! కనక

## మధురాంతకం రాజారాం

# మనుషులు - మమకారాలు

దుర్గ నక్షత్రంలో సూర్యోదయాత్పూర్వం అయిదున్నరకు పైన, ఆరున్నరకులోగా శుభలగ్నంలో వధువు మెడలో మంగళ సూత్రం ముడివేయవలసిన పెళ్లికుమారుడు బ్యాండుమేళంతో కాశీయాత్రకు బయలు దేరి రావడమేమిటి! ఏమిటిదంతా! ప్రభాకరం చిరాకుతో దుప్పటి ముఖం పైకి తీసుకుంటూ కళ్లు గట్టిగా మూసుకుని మళ్ళీ నిద్రపోవడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నాడు. తలుపు పైన చప్పుడయింది!

“ప్రభాకరం! ప్రభాకరం!”

ఇది మునుపటి కంఠం కాదు. ఐతే తన కోసం ఎవరో యిద్దరుగా కలిసి వచ్చారన్న మాట! ఉన్న గోలంతా చాలక కాలేజి ఆవరణలోకి కొత్తగా ఎలక్షను ప్రవేశించాయి బహుశా ఆ వచ్చిన వాళ్ళల్లో ఒకడు ప్రధాన మంత్రిత్వానికి పోటీ చేస్తున్న అభ్యర్థి అయితే కావచ్చు. మరొకడు 'కింగ్ మేకర్' లాంటి తంత్రజ్ఞుడై వుంటాడు. వాళ్ళని లోపలికి రానివ్వడమే ప్రమాదకరం! అరిచి అరిచి నోరు నొప్పెట్టితే వాళ్ళే వెళ్ళిపోతారు.

కానీ మూడోసారి పిలుపు వినిపించేసరికి ప్రభాకరం ఎగిరిపడి పైకి లేచాడు. “వస్తున్నా, వస్తున్నా” అంటూ పరుగున వెళ్ళి తలుపుతీశాడు. తీస్తూనే ఈ వేళ గాని వేళ వీళ్ళెక్కడనుంచీ తగులబడినట్టని లోలోపల విసుక్కున్నాడు

“ఎలాగైతేనేం! ఆఖరుకు నిన్ను నిద్ర లేపగలిగాంరా బాబూ!” అన్నాడు ఆగంతకుల్లో ఒకడు.

“ఘనకార్యం చేశారుగానీ జయవిజయులా ద్వారం కాచిందిచాలు. లోపలికి రండి” అన్నాడు ప్రభాకరం.

ఆ గంతకులు లోపలికి వచ్చారు. ఎర్రటి ఎండు దుమ్ము పేరుకుని పోయిన పాదాలతో దుప్పటి ఖరాబుచేస్తూ ఒకడు దభీమని పరుపు పైన కూలబడి సాపుగా పవ్వళించాడు. మరొకడు ఈజీచేర్ లో కూచుని కాళ్ళని పుస్తకాలున్న అలమారాలోకి చాచాడు. ప్రభాకరం ఆ యిద్దరి ముఖాల్లోకి వింతగా చూస్తూ ఒకటు రెండు నిమిషాలపాటు మౌనంగా వుండిపోయాడు.

“ఒరే బాబూ! ఏదో పెద్ద ప్రసంగానికి తయారౌతున్నట్టుంది నీవాలకం చూస్తుంటే మేమిప్పుడేమీ మాట్లాడే స్థితిలో లేం! ముందు దగ్గరగా వున్న హోటల్లోనుంచీ టిఫిన్ తెప్పించు చెరీ అయిదు యిడ్లీలు, రెండుపూరీలు, కాఫీ, లేదా ఏదయినా సరే - క్విక్, క్విక్” అన్నాడు రామ్మూర్తి.

ఉన్నట్టుండి మేఘాల్లోనుంచీ వూడిపడ్డట్టు ఎప్పుడంటే అప్పుడు రోడ్డులోనో, పార్కులోనో ఈ అపూర్వసోదరులు ఎదురుగావడం, వాళ్లకు తృణమో పణమో ముట్టజెప్పకోడం ప్రభాకరానికి కొత్తగాదు. ఒక్కొక్కసారి వీళ్లు అప్పుడే ఓడదిగిన నాటుదొరల్లా చెరగని యిస్త్రీమడుపుల్లో టిపుటాపుగా కనపడేవారు మరొకసారి తద్వ్యతిరేకంగా బాగా మాసి, మాసికలు పడ్డ లుంగీగుడ్డల్లో కనపడేవారు. వేషమెలా వున్నా వీళ్ల ముఖాల్లో చింతాకంత ఆందోళనయినా కనిపించేదికాదు. ఈనాటికీనాటికి విన్నబోయిన వదనాలతో ఈ అన్నదమ్ములు ప్రత్యక్షమయ్యేసరికి ప్రభాకరానికి జాలిపడక తప్పింది కాదు బహుశా రాత్రంతా నిద్ర లేదేమో, కళ్లు బాగా ఎరుపెక్కి వున్నాయి దవడలు గుంటలు పడి, కళ్లు లోపలికిపోయి, నుదురు కొట్టవచ్చినట్టు పైకి కనబడుతున్న ఆ ముఖాల్లో కాగడా వేసి వెదికినా కాంతి కనిపించే లక్షణాలు లేవు. “అయ్యో, పాపం” అనుకుంటూ దీర్ఘంగా నిట్టూర్చాడు ప్రభాకరం.

అంతగా ప్రభాకరం జాలిపడడానికి మరో బలీయమైన కారణం కూడా లేకపోలేదు వీళ్ళిప్పుడు తండ్రి లేని బిడ్డలు! మామయ్య చనిపోయి యింకా నెలరోజులు కాలేదు. ఆయన మరణశయ్యపైన వీళ్ల కోసం హృదయవిదారకంగా పలవరించాడు. కబురందగానే తను మాత్రం నిలుచున్నపాటున బయల్దేరి వెళ్లాడు. మృత్యుదేవత క్రూరదంష్ట్రల మధ్య నలిగిపోతూ మామయ్య కళ్లు తెరచి తనని చూచాడు. “ఏమైనా తెలిసిందా ప్రభాకరం వీళ్ల ఆచూకీ” అని ప్రశ్నించాడు. లేదన్నట్టు తను శిరఃకంపనం చేశాడు. ఆ ఆఖరు క్షణాల్లో మామయ్యకు పట్టరానంత కోపం వచ్చింది “అందుకే.. అందుకే సరిగ్గా శాసి చేసి పెట్టాను. ఆస్తంతా మీ అత్తయ్య పేర వ్రాసేశాను. వెధవలకు చిల్లి కానీ అయినా దక్కకూడదు. బొచ్చె చేత బట్టుకొని బిచ్చమెత్తుకోవాలి” అని గుక్కెడు మంచినీళ్లు త్రాగి మామయ్య తనని దగ్గిరికి రమ్మని సైగ చేశాడు. మంచం పైన ప్రక్కగా కూచోమన్నాడు “చూడు ప్రభాకరం! వాళ్లు నాకు పుత్రులు కారు. శత్రువులు! ఆ ఆశ నేనెప్పుడో వదులుకున్నాను మరి రాధనేం చేస్తావు బాబూ!” అన్నాడు. తన కళ్ళలో నీళ్ళు నిలిచాయి రాధని గురించి మామయ్య తన నలా ప్రశ్నించడం బొత్తిగా అనవసరం. పుట్టింది మొదలు రాధ బంధులోకంలో తన పెళ్లాంగానే వ్యవహరింపబడుతోంది. లేదంటే పెళ్ళి మాత్రం యింకా కాలేదు. అదీ ఈ సంవత్సరం తన చదువు పూర్తి కాగానే అయిపోతుంది.

మామయ్య చనిపోయిన తరువాత నాలుగు రోజులకు కబురెలా అందిందో గానీ కుమారులిద్దరూ ఓ సంధ్యాసమయాన బస్సుదిగారు. ఊళ్ళో వీళ్ళని చీవాట్లు పెట్టని వాడు పాపాత్ముడు. అత్తయ్య అయితే “ఏముఖం పెట్టుకుని వచ్చారు? మీరూ మనుషులేనా? నాకళ్ళకు కనబడకండి. మిమ్మల్ని చూస్తే చాలు, పాపం చుట్టుకుంటుంది” అని పది నిమిషాలపాటు శాపనార్థాలు కుమ్మరించి రెండుగంటలసేపు వెక్కిళ్ళు పెట్టి ఏడ్చింది.

ఉత్తరక్రియ లైపోయేంతవరకూ వూళ్లోనే వుండి ప్రభాకరం మళ్ళీ పట్నానికి వచ్చేశాడు. వస్తూ యికనైనా గుట్టుగా మసలుకోడం మంచిదని బావమరుదులకు హితవు చెప్పాడు. ఏం కాలానికో గానీ యిప్పుడు అన్నదమ్ములు బుద్ధిగా వున్నారనీ, వాళ్ళలాగే యింటిపట్టునవుండి, పోతే తన కేలాంటి చింతా వుండదనీ ఈ మధ్య అత్తగారు వ్రాయించిన జాబొకటి ప్రభాకరానికి అందింది.

“ఐతే మామొర నీ చెవులదాకా ఎక్కిందన్న మాట! ఒరే ప్రభాకరం! ఆకలికి పేగులు మాడిపోతున్నాయి” ఈసారి రవణ ప్రభాకరాన్ని తీవ్రంగా హెచ్చరించాడు.

ఎదురింటి అబ్బాయిని బతిమాలుకుని ప్రభాకరం హోటలునుంచీ టిఫిన్ తెప్పించాడు. ఉపాహారానంతరం అతిథుల కోరికపైన్నే బంకులోనుంచీ కిళ్ళీలు, సిగరెట్లు తెప్పించి సమర్పించుకున్నాడు. ఆతిథ్య మర్యాదలన్నీ సలక్షణంగా జరిగిపోయిన తర్వాత “యింతకూ మీరిలా ఎందుకు దయచేసినట్లు” అని అసలు విషయాన్ని తనే ప్రస్తావించాడు.

“అర్ధరాత్రప్పుడు బయలుదేరామనుకో! తెల్లవారకముందే యిక్కడికి వచ్చి నిన్ను నిద్రలేపాలనుకున్నాం. సరిగా ఐదుగంటల సైరన్ మ్రోగుతోంది. అప్పుడు మేము స్టేషను దాటుకుని టౌనులోకి వస్తున్నాం” అన్నాడు రామ్మూర్తి.

“నిశాచరులు నయంరాబాబూ మీకంటే! ఏమంత కొంప మునిగిపోయిందని మీరు రాత్రి పూట ప్రయాణం తలపెట్టారో నాకర్థం కావడంలేదు” అన్నాడు ప్రభాకరం.

“అదే చెప్పబోతున్నా! తొందర పడతావెందుకూ! ఒరే రవణా, ఏదీ ఆకాసుల పేరా! ప్రభాకరం చూడనీ” అన్నాడు రామ్మూర్తి.

రవణ తన ఫాంటు జేబులోనుంచీ

నగపైకి తీశాడు. నిర్లక్ష్యంగా దాన్ని ప్రభాకరం ముందరికి విసిరాడు.

"ఎందుకిది? ఏంచేయాలి?" అన్నాడు ప్రభాకరం.

"చేసేదేముంది? అమ్మేయాలి. దూలాలు, వాసాలు లేక ఆయింటిపని అలాగే నిలిచిపోయింది. పంచాయితీ బోర్డువాళ్లు ఈరోజు సాయంత్రం వేపచెట్లు వేలం వేయబోతున్నారు. తక్షణం మూడు వందల రూపాయలు కావాలి, దీన్ని తీసుకెళ్ళి మా అమ్మనీ దగ్గర యిమ్మంది"

"నువ్వేమో దీన్ని అమ్మి డబ్బు తెస్తావు మేము డబ్బుతీసుకుని మధ్యాహ్నం బస్సుకు వూరికి పోతాం. యిదికథ" అంటూ రామ్మూర్తి ప్రారంభించిన కథని రవణ పూర్తిచేశాడు.

ప్రభాకరానికి ఏం చేయడానికీ పాలుపోలేదు. ఇది గూడు పురాణీ కాదుగదా! ఏమోమరి! ఎలాటి పరిస్థితిలో నైనా సరే వీళ్ళు విశ్వాస పాత్రులు కానిమాట నిజం! ఐనా ఓడు ఓడని కుండంతా ఓడంటే ఎలాగ? ఆయిల్లు కట్టి, కొత్తలోగిట్లో రాధకి పెళ్ళి చేయాలని అత్తయ్య ఆశయం. ఇంట్లో డబ్బులేని మాటగూడా వాస్తవమేమరి! మామయ్యకు డబ్బునిలవచేసే వాడుక లేదు. హరికథల్లో ఆయన ఏడాదికి రెండు వేలకు తక్కువ గాకుండా సంపాదించే వాడు. సంపాదించిన డబ్బంతా ఆయన పొలాల పైన పెట్టాడు. కొత్తగా భూములు కొన్నాడు. సముద్రంలాంటి బావులు త్రవ్వించాడు. అనారోగ్యమూ, వృద్ధాప్యమూ క్రుంగదీసివుండకపోతే ఆ యింటిపనిగూడా ఎప్పుడో పూర్తయి వుండేది.

ప్రభాకరం కాసుల పేరు జేబులో వేసుకుని వీధిలోకివస్తూ, వీధిమెట్లపైన నిల్చుని కూడా కొంతసేపు తటపటాయించాడు. వీళ్ళు దీన్ని అమ్మి డబ్బు కాజేయదలచుకుని వున్నట్లయితే తనదాకా ఎందుకు రావాలి? వాళ్ళకు అమ్ముకోడం చేతకాదేమిటి? అబ్బే, తను మరీ సందేహప్రాణి అయిపోతున్నాడు. అనుమానం ప్రాణసంకటమని సెలవిచ్చారు పెద్దలు!

తన సందేహాలకు తనే సమాధానం చెప్పుకుని ప్రభాకరం బజారుకేసి నడిచాడు

మరునాటి వుదయం ప్రభాకరానికి వూళ్ళోనుంచి ఒక జాబువచ్చింది. ఆద్యంతాలు వదిలిపెడితే ఆ జాబులో ముచ్చటగా మూడు వాక్యాలుమాత్రమున్నాయి "నీ బావమరదులు నిన్నటిరోజు రాత్రి వేళ యింట్లోనుంచీ పరారై పోయారు. మా మామయ్య ఎప్పుడో చేయించిన పాత కాసుల పేరుగూడా కనిపించడంలేదు. ఈ





# ఆరోగ్యమునకు అతి సులభమార్గము



మీ బిడ్డలు యిష్టముతో పాలు సేవించే విషయమై యిక మీరు శ్రమ పడనక్కర లేదు బ్రౌన్ అండ్ పోల్సన్ కస్టర్డ్ పొడరుతో తయారు చేసిన మీగడ పదార్థము వారికి చాలయిష్టము అందులో ఆరోగ్యధాతువులు వున్నవి. యిది మీరు పాలతో తయారు చేయండి యిది పరిశుద్ధమైన శాఖాహార వుత్పత్తి.

ఉచితము – 'ఫలహారానికి మంచి వస్తువులు' అనే విస్మయము చెందే ఒక చిన్న పుస్తకము మీ పేరు, చిరునామా యిస్తూ రెండు అణాల పోస్టల్ స్టాంపులతో యీ దిగువ అడ్రసుకు వ్రాయండి.

కార్న్ ప్రాడక్ట్స్ కో., (ఇండియా) ప్రయివేట్ లి.,

పోస్టు బాక్సు నెం. 994, బొంబాయి.

# ★ మనుషులు-మమకారాలు ★

జాబు చూచిన తక్షణం బయల్దేరి రావలసింది."

* * *

పార్వతమ్మలో యిలాటి మార్పుగూడా కలుగవచ్చునని ఎవరనుకున్నారు? వేళ్ళకు నీళ్ళందక కరువుకాలంలో వాడిమాడిపోయే కదళీతరువులా హృదయం మొద్దుబారిపోయిన తర్వాత ఎవరైనా మారిపోక తప్పదు. ఈసారి తను కన్పించగానే పార్వతమ్మ హృదయోద్వేగం తుపానులా పెల్లుబుకుతుందనుకున్నాడు ప్రభాకరం. కానీ అలాటిదేమీ జరుగలేదు. కన్నీళ్ళన్నిటినీ ఏనాడో వ్యయించుకున్న అనార్ద్రనయనాలతో పార్వతమ్మ ప్రభాకరంకేసి ఒకసారి చూచింది. ఆ పిచ్చివాలకాన్ని చూచి ప్రభాకరం విస్తుపోయాడు.

"తెలిసి తెలిసీ అడుసులో కాలువేశావత్తయ్యా! వాళ్ళంతటి ద్రోహానికి ఒడిగట్టారని నాకు తెలియదు. నువ్వు అమ్మిపెట్టమన్నారని వాళ్ళు నగను తీసుకొచ్చి నాచేత బెట్టారు. నేను నిజమేననుకున్నాను" అన్నాడు ప్రభాకరం.

ఇక్కడ పొరుగింటి పెద్దమనిషి ఒకతను కలుగజేసుకుంటూ "వాళ్లు జగమెరిగిన బ్రాహ్మణులు రా బాబూ! స్వయంగా వాళ్లే అమ్మకానికి బయల్దేరితే ఎవరికైనా సందేహం కలుగుతుంది. అందుకని అవసరానికి నిన్నుపయోగించుకున్నారు" అన్నాడు.

అప్పటికీ పార్వతమ్మ మాట్లాడలేదు.

ప్రభాకరం పార్వతమ్మ దగ్గరికివెళ్ళి కుర్చీలో కూచుంటూ "అదిగాదత్తయ్యా! జరిగిందేమో జరిగిపోయింది వాళ్ళేనాటికైనా యింతే. అందుకు బెంగపడిమాత్రం ఏం లాభం" అని వూరడించబోయాడు.

"నాకిప్పుడొకే బెంగ ప్రభాకరం! రాధకి పెళ్లికావాలి. పెళ్లయిపోవడం తరువాయి, ఆస్తి మీ పేర వ్రాసి నేనే ఆశ్రమానికైనా వెళ్లిపోతాను. ఇంట్లోవున్నంతకాలం నాకీ వేదన తప్పదు ఇంత పని చేసినవాళ్లు, ఏ అర్ధరాత్రప్పుడో తలమీద రాయివేయడానికి వెనుదీస్తారని నేనెలా అనుకోను! నేను శాస్త్రుల్ని అడిగి ముహూర్తంకూడా చూచివుంచాను. అన్నయ్యకెలాగైనా నచ్చజెప్పుకుంటాను నువ్వు నాలుగురోజులు సెలవు పెట్టి యింటికి వచ్చేయ్. పెళ్లి కాగానే పిల్లాన్ని తీసుకెళ్లి పట్నంలో కాపురంబెట్టు" అంది పార్వతమ్మ.

ప్రభాకరం బాగా ప్రొద్దుపొయ్యేంతవరకూ ఆలోచించాడు. ఆ పరిస్థితిలో అత్తయ్య అలాటి నిర్ణయానికి రావడానికన్నా మార్గాంతరంలేదు. నాన్నగారి దృష్టి మొదటినుంచీ మామయ్య సంపాదించిపెట్టిపోయిన ఆస్తిపైన్నేవుంది. ఆవిషయం అత్తయ్య తేల్చి చెప్పేసిందిగనుక ఈ పెళ్లికిక ఏవైపునుంచి చూచినా ఆటంకంలేదు. ఇక తను మాత్రం ఎందుకు అడ్డుమాట వేయాలి

భోజనానంతరం ప్రభాకరం "నాదేముందత్తయ్యా! నువ్వూ, నాన్నగారు కలసి ఏంచేయమన్నా నేను సిద్ధమే" అని తననిర్ణయాన్ని తేల్చివేశాడు.

అనుకున్నట్టు పెళ్ళి సలక్షణంగా జరిగిపోయింది. పెళ్ళయిన మరునాడే పార్వతమ్మ ఆస్తిని గురించిన ప్రస్తావన తెచ్చింది. ఒకవైపు అత్తగారు, మరోవైపున బావమరదులు బ్రతికివుండగానే ఆస్తి తన పేరిట వ్రాయించుకుంటే లోకాపవాదానికి గురికావలసి వస్తుందని ప్రభాకరానికి లోలోపల జంకు. అందుకని అతడు వుభయతారకంగా ఒక ఎత్తువేసి ఆస్తిని రాధపేర వ్రాయించడం బాగుంటుందని పార్వతమ్మకు సలహా చెప్పాడు. కానీ రాధ అందుకు ససేమిరా ఒప్పుకోనంది. "కొండలా మీరుండగా నా పేర వ్రాయించుకోడమేమిటి! నవ్వుతారెవరైనా" అంటూ ఆమె భర్త నిర్ణయానికి అడ్డు తగిలింది.

"మీరు పదండి, లేవండి ఎప్పుడు కబురు పంపితే అప్పుడు వచ్చి ఆస్తి మీలో ఎవరి పేరిట వ్రాసివ్వమన్నా వ్రాసిస్తాను" అంది పార్వతమ్మ.

* * *

సతీ సమేతంగా ప్రభాకరం ఆశ్రమ పరిసరాల్లో కాలుబెట్టేసరికి (వేదాంతుల పరిభాషలో) గూటిలోనుంచీ చిలుక ఎగిరిపోయింది. నిర్లిప్త హృదయులైన సన్యాసులమధ్య గొంతెత్తి ఏడవడానికైనా రాధకు వీల్లేకపోయింది. సాయంత్రానికి దహనక్రియలు సాంగంగా నెరవేరిపోయాయి. ఆ రాత్రి పార్వతమ్మ మనశ్శాంతికోసం ఆశ్రమంలో గీతాపారాయణం జరిగింది. మరునాటి వుదయం దంపతులకు వీడ్కోలిస్తూ ఆశ్రమవాసి స్వామి శాంతానంద "పార్వతమ్మని మీరు పూర్వాశ్రమంలో మాత్రం ఎరుగుదురు. బాబూ! దీక్షస్వీకరించిన నాటినుంచీ ఆమె ఆశ్చర్యకరంగా మారిపోయింది. అనాగత విషయాల్ని వూహించేంతవరకూ ఆమె మనసు పరిపక్వం చెందిందంటే, ఈ విషయం మీకు విచిత్రంగానే తోచవచ్చు. లేకుంటే ఆమె తన చావును తానే తెలుసుకున్నట్టు సరిగ్గా పదిరోజులకు ముందుగా వీలునామా ఎలా వ్రాయించగలుగుతుంది. చెప్పండి" అంటూ పార్వతమ్మ తమకిచ్చిపోయిన విలును ప్రభాకరం చేతిలో పెట్టారు.

ఆ రోజు బస్సురావడానికి కొంచెం ఆలస్యమయింది. దంపతులు అరగంటసేపు రోడ్డుప్రక్కన కానుగ చెట్టు క్రింద మౌనంగా కూచున్నారు. ఉన్నట్టుండి తల పైకెత్తి రాధ "ఏమండీ! ఆ కాగితాలిలా యివ్వండి చూద్దాం" అంది.

"చూడ్డానికేముంటుందని! అంతా మనకు తెలిసిందేగా!" అన్నాడు ప్రభాకరం.

"ఏమిటి మనకు తెలిసింది?"

"ఎలాగైనా నువ్వు కుమార్తెవి. చివరికి ఆమె నీ పేరిటే వ్రాసివుంటుంది"

"మా అమ్మ సంగతి మీకంటే నాకు బాగా తెలుసు. ఆమెకు మీరంటే ప్రాణం. విల్లు చూడండి మీకే తెలుస్తుంది."

"అలాగయితే నువ్వేచూడు" అంటూ ప్రభాకరం విల్లును రాధ ఒడిలోకి విసిరాడు. ఎందుకోగానీ అసలు విషయం తెలుసుకోడానికి ప్రభాకరానికి ధైర్యం చాలడంలేదు. అకారణంగా గుండె దడదడ కొట్టుకుంటోంది.

రాధ తొందరగా కాగితాలు త్రిప్పుతూ ఒకచోట ఆగి "అయ్యో! యిదేమిటండీ! ఇలావచ్చి చూడండి బాబూ! నాకేమీ అర్థం కావడం లేదు" అంది.

ప్రభాకరం విల్లులోకి చూచాడు.

ఉన్న ఆస్తిని సరిగ్గా రెండు భాగాలుచేసి ఒక భాగాన్ని రామ్మూర్తికి, రెండో భాగాన్ని రవణకి వ్రాయించింది పార్వతమ్మ! ★

---

తెలుగు మేష్టారు మిత్రభేదం పాఠం చెబుతూ యిలా అన్నారు: "చిన్నయసూరి గొప్ప పండితుడు. ఆయన స్వయంగా బాలవ్యాకరణమనే గ్రంథం వ్రాయడమేకాకుండా, ఎక్కడా వ్యాకరణ దోషాలు లేకుండా నీతిచంద్రిక అనే వచన గ్రంథం కూడా వ్రాశాడు."

ఒక విద్యార్థి లేచి "మేష్టారూ! నావ్యాకరణం నేనే రాసుకుంటే, నేనుకూడా తప్పులు లేకుండా రాయగలనండి" అన్నాడు.